సీబీఐ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడు ముమ్వ సతీష్ చౌదరి

వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): సీబీఐ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా మూడవ సారి ముమ్వ సతీష్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.ఫణి రెడ్డి, జీ.వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా ఎ.యాదయ్య, కోశాధికారిగా వై.మహేందర్ రెడ్డి, గౌరవ సలహాదారులుగా డి.సిద్దయ్య, జీ.రవి, పాలక మండలి సభ్యులుగా జె.అంజయ్య, బి.మురహరి, కె.మహేశ్వర్ రెడ్డి, ఆర్.రవి, వై.ముత్యం రెడ్డి, టీ.ప్రవీణ్ గుప్తా, జి.రమేష్ నాయక్, జి.విజయ్ కుమార్‌లు ఎన్నికయ్యారు.

ఏవీఎన్ కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతికి పీహెచ్‌డీ



విట్ వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న రేవతి దుర్గం

మన్సూరాబాద్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని ఏవీఎన్ కళాశాల డేటా సైన్స్ విభాగాధిపతి రేవతి దుర్గంకు విట్(వల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- ఏపీ) యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. నాగోల్ డివిజన్‌కు చెందిన ఆమె "హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్స్" అనే అంశంపై ప్రొఫెసర్ దేవరకొండ నాగరాజు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను విట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు.

భీమ్ ఆర్మీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొంగరి అశోక్



వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్ర జ్యోతి): భీమ్ ఆర్మీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్యనగర్ కాలనీకి చెందిన కొంగరి అశోక్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి కొంగరి అశోక్‌కు నియామక పత్రం అందజేశారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిటీ స్మాల్ కాస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నర్సింగ్‌రావు

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

● సిటీ స్మాల్ కాస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నర్సింగ్‌రావు

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని సిటీ స్మాల్ కాస్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నందికొండ నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం కొత్తపేటలోని బాబుజగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో లీగల్ అవగాహన సదస్సు, ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసేది ఉపాధ్యాయులు మాత్రమేనని అన్నారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు బాధ్యతతో ఉండి విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీదేవి, శ్రీ వెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజ్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, స్వమేధ ఎడ్యుకేషన్ సర్వీస్ నిర్వాహకులు నర్సింహారావు, రిటైర్డ్ ప్రొఫెసర్ పెద్ది శివప్రసాద్, తెలంగాణ ప్రైవేట్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సందీప్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, కోశాధికారి జార్జ్‌పాల్, ఉపాధ్యక్షుడు రాము, జాయింట్ సెక్రటరీ నరేందర్ పాల్గొన్నారు



విశ్వకర్మ మహాయజ్ఞం సందర్భంగా నిర్వహించిన పూజల్లో పాల్గొన్న సబితారెడ్డి, ఆచారి తదితరులు

వైభవంగా విశ్వకర్మ మహా యజ్ఞం

సరూర్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో విశ్వకర్మ మహా యజ్ఞం, హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ తదితరులు హాజరై విశ్వకర్మ దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన విశ్వకర్మ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్ర జ్యోతి): పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాహెబ్‌నగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు, పద్మావతినగర్‌కు చెందిన ఒకరు, కమలానగర్‌కు చెందిన ఒకరు, మెడికల్ అండ్ హెల్త్ కాలనీకి చెందిన ఒకరు, ఎన్జీవోస్ కాలనీకి చెందిన ఒకరు కలిసి గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో గత కొంతకాలంగా పేకాటాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఆ ఇంటిపై ఆదివారం రాత్రి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురినీ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద ఉన్న 65వేల 650 నగదు, 6 సెల్ ఫోన్లు, 1 ప్లేయింగ్ కార్డ్ సెట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఈ చెత్త మీ ఇంటి ముందు పడేస్తే ఊరుకుంటావా?'

● వ్యాన్ డ్రైవర్‌ను మందలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి

● మీర్‌పేట్ పెద్దచెరువు కట్టపై ఘటన



చెరువులో చెత్తను పడేసిన వాహనం డ్రైవర్‌ను మందలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): "ఎక్కడి చెత్తనో తీసుకొచ్చి ఇక్కడి చెరువులో వేస్తున్నావు కదా.. ఇదే చెత్తను తీసుకొచ్చి మీ ఇంటి ముందు పడేస్తే ఊరుకుంటావా?".. అని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి చెత్తను తరలించే ఓ వ్యాన్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. దాంతో సదరు డ్రైవర్‌ను నీళ్లు నమిలాడు. ఆదివారం మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్ల పరిధిలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న సబితారెడ్డి అనంతరం మీర్‌పేట్ పెద్దచెరువు కట్ట మీది నుంచి వెళ్తుండగా అదే సమయంలో ఓ వాహనంలో చెత్త తీసుకువచ్చి చెరువులో వేస్తుండటం కనిపించింది. వెంటనే ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి ఆ యువకుడిని పిలిచి సున్నితంగా మందలించారు. 'మీ ఇంట్లో, మీ వీధిలో చెత్త ఉంటే ఎంత అసహ్యంగా అనిపిస్తుందో.. చెరువులో చెత్త వేస్తే కూడా అంతే అసహ్యంగా తయారవుతుంది .. ఆ మాత్రం అవగాహన లేకపోతే ఎలా?' అని ప్రశ్నించారు. ఇంకెప్పుడు ఇలా చెరువుల్లో చెత్త పడేయొద్దని, మరోసారి కనిపిస్తే పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తామని మందలించారు. అనంతరం సదరు చెత్త వాహనాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు.

హిందూ ద్రోహి వైఎస్ జగన్

● లడ్డూ ప్రసాదం కలుషితం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● యువమోర్చా నేత రామకృష్ణారెడ్డి డిమాండ్



సరూర్‌నగర్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఎంతో పవిత్రమైన తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి లడ్డూను కల్తీ చేసిన ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ హిందూ ద్రోహి అని బీజేవైఎం బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఆరోపించారు. యావత్ హైందవ జాతి మనోభావాలను దెబ్బతీసిన జగన్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆదివారం బడంగ్‌పేట్ చౌరస్తాలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. 'హిందూ ద్రోహి జగన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, లడ్డూ పాపంలో భాగస్వాములైన ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దని, చట్ట ప్రకారం అందరికీ శిక్షలు పడేలా చూడాలని అన్నారు. వైఎస్ జగన్ ఏపీ సీఎంగా ఉన్నప్పుడు ఆ రాష్ట్రంలో దాదాపు 300 హిందూ దేవాలయాలను కూల్చివేయించాడని, తాజాగా లడ్డూ కల్తీ వ్యవహారం బయటపడిందని, దీనికి పూర్తిగా ఆయనదే బాధ్యత అని రామకృష్ణారెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నడికుడ యాదగిరి, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, నాయకులు పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నవారు శ్రీనివాస్‌రెడ్డి, మోరలోకం, రుద్ర నర్సింగ్‌రావు, బెల్ల రాజు, మంత్రి మహేశ్, చిత్రం శ్రీను, నిమ్మల రవికాంత్‌గౌడ్, శివారెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

హుక్కా సెంటర్ నిర్వాహకులపై కేసు

వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ సోహెబ్ ఖాన్ (32) కొంత కాలంగా మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్యనగర్ కాలనీలోని సుబ్బయ్యగారి హోటల్ పై అంతస్తులో హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. బహదూర్‌పురకు చెందిన సయ్యద్ షెహరాజ్(26) ఈ సెంటర్‌లో పని చేస్తున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా హుక్కా సెంటర్ నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శనివారం అర్ధరాత్రి సదరు హుక్కా సెంటర్‌పై దాడి చేసి 3 హుక్కా పాట్స్, 4హుక్కా పైపులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



ప్రమాదం చనిపోయిన మహిళ మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ జాతీయ రహదారి గండిమైసమ్మ ఆలయం సమీపంలో యూ గ్రాండ్ హోటల్ ఎదురుగా గుర్తు తెలియని (45-50) వయస్సు గల మహిళ రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ నుంచిచౌటుప్పల్ వైపునకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు యాచకురాలుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధ్యయన యాత్రలో హస్తినాపురం కార్పొరేటర్



మేయర్ విజయలక్ష్మితో కలిసి లక్నో పర్యటనలో కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): అధ్యయన యాత్రలో భాగంగా హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతా నాయక్ జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నగర కార్పొరేటర్ల బృందంతో కలిసి ఆదివారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో పర్యటించారు. పారిశుధ్యం, ట్రాఫిక్ పరిస్థితులపై అధ్యయనం కోసం వారు ఈ పర్యటన చేపట్టారు. కాగా, వివిధ ప్రాంతాలలో పర్యటించి లక్నోలోని పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామని కార్పొరేటర్ సుజాతా నాయక్ తెలిపారు.



అభాగ్యులకు నగదు సాయం చేసి, దుప్పట్లు అందజేస్తున్న బేబి పర్ణికారెడ్డి

చిన్నారి దాతృత్వం..!

● కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బు అనాథాశ్రమానికి అందజేత

సరూర్‌నగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల ఆ చిన్నారి తన దాతృత్వాన్ని చాటుకుంది.. కుటుంబ సభ్యులు అప్పుడప్పుడు ఇచ్చిన పాకెట్ మనీని కిడ్డీ బ్యాంక్‌లో దాచుకుంది. సదరు మొత్తం రూ.10వేలు కాగా, ఆదివారం తన పుట్టిన రోజు సందర్భంగా ఆ సొమ్మును బడంగ్‌పేట కార్పొరేషన్ నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాథాశ్రమానికి అందజేసింది. తుర్కయాంజాల్ మునిసిపాలిటీలోని రాగన్నగూడ సామ లక్ష్మారెడ్డి కాలనీకి చెందిన సామ వరుణ్‌రెడ్డి-దివ్యారెడ్డిల కూతురు బేబి పర్ణికారెడ్డి(6) స్థానిక శ్లోకా పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. తాను దాచుకున్న డబ్బును ఏదైనా ఆశ్రమానికి ఇవ్వాలని కుటుంబ సభ్యులకు చెప్పగా వెంటనే వారు రాగన్నగూడ లయన్స్ క్లబ్ ప్రతినిధులు జూపల్లి వెంకటేశ్వరరావు, పూజారి శంకరయ్యలను సంప్రదించి వారి సహకారంతో నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ ఆశ్రమానికి వెళ్లి సదరు సొమ్మును ఆశ్రమ నిర్వాహకుడు గట్టు గిరికి అందజేశారు. లయన్స్ క్లబ్ సమకూర్చిన దుప్పట్లు, టవల్స్‌ను సైతం చిన్నారి పర్ణిక చేత అభాగ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పర్ణిక తాతనానమ్మ సామ భీంరెడ్డి, వరలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు ఇవ్వాలి: సీపీఎం



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న చంద్రమోహన్, ఎల్లయ్య తదితరులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనీ సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలో వనస్థలిపురం సీపీఎం శాఖ మహాసభను ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ మాట్లాడుతూ, ఇల్లు లేని పేదలందరికీ ప్రభుత్వం తక్షణమే ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బి.కాశయ్య కె.సుమన్, లక్ష్మయ్య, రాధమ్మ, భాగ్యమ్మ, కోమలత, యాదయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలో ఆదివారం సాయంత్రం 2008-2011 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ వై.అశోక్ రెడ్డి మాట్లాడుతూ, 13 ఏళ్ల అనంతరం అందరం ఒకే చోట కలుసుకోవడం ఆనందంగా ఉంద న్నా రు. ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో రాణించి, కుటుంబానికి, సమాజానికి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలన్నారు. ఎంసీఏ చదువుకునే రోజుల్లో నాటి జ్ఞాపకాలను తమ స్నేహితులు, ఉపాధ్యాయులతో నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, సుధాకర్, సందీప్, హక్కాని తదితరులు పాల్గొన్నారు.

ఐకానిక్ బిల్డింగ్ ప్రారంభమెప్పుడో..?

● జేఎన్‌టీయూలో రూ.50 కోట్లతో నిర్మించిన గోల్డెన్‌జూబ్లీ భవనం

● పనులు పూర్తయి 4 నెలలైనా.. విద్యా సంవత్సరం ప్రారంభమై 3 నెలలైనా నిరుపయోగంగానే...



నిరుపయోగంగా మారిన ఐకానిక్ బిల్డింగ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీకి ఆర్ట్స్ కాలేజీ భవనం మాదిరిగా.. జేఎన్టీయూ హైదరాబాద్‌కు మరో ఐకానిక్ బిల్డింగ్‌ను నిర్మించారు. యూనివర్సిటీ ఏర్పాటై 50 ఏళ్ల(గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన సందర్భంగా యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి నిమిత్తం రూ.50కోట్లతో గతేడాది అప్పటి వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి హయాంలో నిర్మాణ పనులు చేపట్టారు. తన పదవీ కాలంలో పూర్తయ్యే(మే21)లోగా భవనాన్ని ప్రారంభించాలనే కట్టా నర్సింహారెడ్డి ఆశ ఎన్నికలకోడ్ ఫలితంగా నెరవేరలేదు. వాస్తవానికి ఈ భవనంలో ప్రతి అంగుళం స్పేస్‌ను ఏయే విభాగాలకు కేటాయించాలో, ఏయే అంతస్తుల్లో ఎటువంటి సదుపాయాలు సమకూర్చాలో పక్కాగా ప్లాన్ చేసిన మాజీ వీసీ కలలు నెరవేరకుండానే ఆయన పదవీకాలం ముగిసింది. అప్పట్నుంచీ ఎంతో విలువైన ఈ భవనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రారంభిస్తారని విద్యార్థులు, ఆచార్యులు ఆశపడినా, రెగ్యులర్ వీసీ లేకపోవడం, ఇన్‌చార్జ్ వీసీ పట్టించుకోక పోవడంతో వారి ఆశలు నెరవేరలేదు.

భవనం ప్రణాళిక ఇదీ..

ఈ భవనంలోని ఒక్కో అంతస్తులో 17వేల చదరపు అడుగుల చొప్పున మొత్తం ఎనిమిది అంతస్తుల్లో కలిపి 1.36లక్షల చదరపు అడుగుల స్పేస్ సిద్ధంగా ఉంది. ఐకానిక్ భవనాన్ని తొలుత.. ఇంటర్ డిసిప్లినరీ అకడమిక్ రీసెర్చ్ అవసరాలకు వినియోగించాలని అధికారులు భావించారు. అయితే.. ఇందులోనే అదానీ కొనెక్స్ సంస్థ రూ.5కోట్లతో అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు నాడు జేఎన్‌టీయూతో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఒక అంతస్తును కేటాయించాలనుకున్నారు. అలాగే, భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సౌజన్యంతో బీటెక్ స్పేస్ టెక్నాలజీ కోర్సును జేఎన్‌టీయూ నిర్వహించాలని భావించింది. ఈ క్రమంలో మరొక అంతస్తును ఇస్రోకు కేటాయించాలని జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు అంగీకారానికి వచ్చారు. మిగిలిన ఆరు అంతస్తులను ఏవిధంగా వినియోగంలోకి తేవాలనే అంశంపై వర్సిటీ ఉన్నతాధికారులు పెద్ద కసరత్తే చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆయా కోర్సుల నిర్వహణకు, ల్యాబొరేటరీల ఏర్పాటుకు అవసరమైనన్ని తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు, ఆచార్యులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనం ప్రారంభిస్తే విద్యార్థులకు మరిన్ని మౌలిక వసతులు సమకూరుతాయని వర్సిటీ అధికారులు భావిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ముగిసి మూణ్ణెల్లయినా..

గత మే నెలలో రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో జేఎన్‌టీయూలో ఐకానిక్ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి ఎన్నికల సంఘం అనుమతించలేదు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈ భవనాన్ని ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావించారు. అయితే, గత జూలై 13న జేఎన్‌టీయూలో జరిగిన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు శిలాఫలకాలను కూడా సిద్ధం చేశారు. చివరి నిమిషంలో ప్రోటోకాల్ సమస్యలు ఉత్పన్నం కావడంతో రూ.50కోట్ల విలువైన భవనాన్ని ప్రారంభించకుండానే ముఖ్యమంత్రి వెనుదిరిగారు. దీంతో భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తున్న ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం.. ఆయనకున్న పలు అదనపు బాధ్యతల కారణంగా వర్సిటీ పాలనకు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారని, గోల్డెన్ జూబ్లీ భవనం ప్రారంభానికి నోచుకోక పోవడానికి ఇది కూడా ఒక కారణమని విద్యార్థి సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా భవనాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జేఎన్‌టీయూకు రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నేతలు

పీడీఎస్‌యూ గోల్డెన్ జూబ్లీ పోస్టర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ 50 వసంతాల మహోత్సవం (గోల్డెన్ జూబ్లీ) మహాసభ పోస్టర్‌ను ఆదివారం మీర్‌పేట్‌లోని బాలాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవైఎల్ బాలాపూర్ మండల శాఖ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కోట్లాది మంది యువతలో చైతన్య జ్వాల రగిల్చి పోరుబాటలో నడిపించిన ఘన చరిత్ర పీడీఎస్‌యూది అని అన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ బాలాపూర్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాకేశ్, భీమేశ్, సభ్యులు శంకర్, మహేశ్, ప్రవీణ్, నరేందర్, జగదీష్, వసంత్, అరుణ్ పాల్గొన్నారు.



కొలన్ శివారెడ్డి కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు

కొలన్ శివారెడ్డి కాలనీ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి ఎన్నిక

హయత్‌నగర్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని కొలన్ శివారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొలన్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దేవేందర్‌రెడ్డి, జి. నరసింహ, ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా మహేష్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు రాజు, కోశాధికారిగా చంద్రయ్య, కార్యనిర్వాహక సభ్యులుగా నాగభూషణం, వెంకటరెడ్డి, కేశవరెడ్డి, ఎస్‌పీ శ్రీనివాస్, యాకుబ్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్. వెంకటేష్, జి. సురేందర్‌రెడ్డి, లింగరాజు, సీహెచ్ నరసింహలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొలన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలను స్థానిక కార్పొరేటర్ కొప్పుల నరసింహా రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన కాలనీ వాసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య పరిరక్షణ చాలా అవసరం

● రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి



జిమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో ఆరోగ్య పరిరక్షణ చాలా అవసరమని, ఇందుకు ప్రతి ఒక్కరూ నిత్యం యోగా, మెడిటేషన్, జిమ్ వంటివి చేయాలని రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ అలకాపురి చౌరస్తా సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన విల్ పవర్ జిమ్ సెంటర్‌ను శనివారం రాత్రి ఆయన ముఖ్యఅతిథి విచ్చేసి ప్రారంభించారు. అత్యాధునిక పరికరాలతో 10 మంది ట్రైనర్లతో జిమ్‌ను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులు సైదులు, వంటిపాక వినయ్‌కుమార్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అనంతుల కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్ రెడ్డి, సిద్దాల ఐలయ్య, శివచరణ్‌రెడ్డి, బండ సురేందర్‌రెడ్డి, ప్రసాద్, బాబ్జీ, రంగారెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి కుట్టులో ఉచిత శిక్షణ

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయంగా ఆర్థికాభివృద్ధి చెందేందుకు కుట్టు శిక్షణతోపాటు కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఆదివారం ఆయన ముసారాంబాగ్ డివిజన్ లోని సలీంనగర్‌లోని సలీంఖాన్ కమ్యూనిటీహాల్‌లో గల కుట్టు శిక్షణ కేంద్రంలో 50 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా మిషన్లను పంపిణీ చేస్తున్నా మన్నారు. వీటి ద్వారా ఇంట్లోనే దుస్తులను కుట్టి ఉపాధి పొందాలని సూచించారు. ఎంఐఎం మలక్‌పేట ఇన్‌చార్జి నజీమాతోపాటు పలువురు పాల్గొన్నారు

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడమే లక్ష్యం

● ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా ప్రచారం చేస్తామని ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ అన్నారు. శనివారం రాత్రి చంచల్‌గూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎంబీటీ ఆధ్వర్యంలో జరిగిన 33వ జల్సా ఇ మిలాద్ ఉన్ నబీలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లింలతో చెలగాటమాడిన తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన పతనమైందని, తాజాగా సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌లా మైనార్టీల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నారని అంజదుల్లాఖాన్ ఆరోపించారు. ఇటీవల జరిగిన జైనూర్ ఘటనను ఇందుకు ఉదాహరణగా ఆయన పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని ఈ జల్సా వేదిక నుంచే తాను శపథం చేస్తున్నానని అంజదుల్లాఖాన్ అన్నారు. ఎంబీటీ అధ్యక్షుడు మాజీదుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ సినీ నటుడు అక్కినేని

● సీనియర్ సినీ జర్నలిస్టు ఎస్వీ రామారావు



మాట్లాడుతున్న సీనియర్ సినీ జర్నలిస్టు ఎస్వీ రామారావు

కొత్తపేట, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): పలు సినిమాల్లో అవకాశాలు అందుబాటులో ఉన్నా తాను న్యాయం చేయగలిగే పాత్రలను ఎంపిక చేసుకున్న అత్యుత్తమ సినీ నటుడు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వర్‌రావు అని సీనియర్ సినీ జర్నలిస్టు సినీ విజ్ఞాన విశారదగా సుపరిచితులైన ఎస్వీ రామారావు అన్నారు. ప్రఖ్యాత చలన చిత్ర నటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి సందర్భంగా న్యూ నాగోల్ సీనియర్ సిటిజన్స్ ఫోరం, స్వరఝరి కల్చరల్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగిన సంగీత విభావరిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఏఎన్ఆర్ సినీ ప్రస్థానంపై ఆయన తయారు చేసిన అక్కినేని జైత్రయాత్ర లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు ఏఎన్ఆర్ సినిమాల్లోని పాటలను పాడారు. ఫోరం కార్యదర్శి కేఎస్ఎన్ మూర్తి, అధ్యక్షులు జ్ఞానకుమార్, హనుమంతరావు, కాశీనాథరావు, రవికుమార్, సంగమేశ్వర్ రెడ్డి, విజయలక్ష్మి, రామలక్ష్మి, రాజ్యలక్ష్మి హిరణ్‌బాల, సవితశ్రీ పాల్గొన్నారు.

అక్టోబర్ 9న గో ధ్వజ్ స్థాపన భారత్‌యాత్ర

● బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 22(ఆంధ్రజ్యోతి): అక్టోబర్ 9న గో ధ్వజ్ స్థాపన భారత్ యాత్ర 2024 చేపడుతున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, సంఘం నాయకులు ఆలూరి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ, అక్టోబర్ 9న రవీంద్రభారతి వేదికగా ముకుందానంద బ్రహ్మాచారిజీ దక్షిణ పీఠం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర శంకరాచార్య స్వాగత కమిటీ చైర్మన్ చిల్లప్పగారి లక్ష్మీరాజం సమక్షంలో చేపట్టనున్న గోధ్వజ్ స్థాపన యాత్ర కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య స్వామి, అవిముక్తేశ్వర నంద సరస్వతి-1008 హాజరవుతారని వారు తెలిపారు. రవీంద్రభారతిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గో ప్రేమికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.